రోడ్డు వెడల్పు పూర్తయ్యేనా?

- ముప్కాల్ మండల కేంద్రంలో నత్తనడకన సాగుతున్న పనులు
- ఐదు నెలలు కావస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా..
- పనుల చుట్టూ రాజకీయ వివాదాలు


ప్రారంభ దశలోనే ఉన్న రోడ్డు వెడల్పు పనులు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో చేపడుతున్న రోడ్డు వెడల్పు పనులు పూర్తయ్యేదెప్పుడో అంటూ స్థానికులు వాపోతున్నారు. రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టడానికి ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులను గత జనవరిలో ప్రారంభించారు. కాని పనులు మూడు రోజులు ముందుకు, ఆరు రోజులు వెనక్కు అన్నట్లు సాగుతున్నాయి. పనులు శంకుస్థాపన చేయగానే వారం రోజులకే ప్రారంభమయ్యాయి. దీంతో పనులు వేగంగా పూర్తవుతాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కాని వారి ఆనందాన్ని స్థానిక రాజకీయాలు, వివాదాలు ఆవిరి చేశాయి. రోడ్డు మధ్యలో నుంచి 45 ఫీట్లు అంటూ కొందరు, 55 ఫీట్లు అంటూ మరికొందరు, 40 ఫీట్లే ఉండాలని ఇంకొందరు ఇలా వర్గాలుగా విడిపోయి కొన్నాళ్లు పనులు సాగకుండా చేశారు. ఇప్పటికీ వివాదాలు ఆగడం లేదు. తనకు ఉపాధినిచ్చే ఇంటికి కూలదోయ వద్దు అంటూ మరొకరు ఏకంగా హైకోర్టునే ఆశ్రయించారు. ఇలా అనేక సమస్యల మధ్య రోడ్డు వెడల్పు పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు..

ఐదు నెలలుగా రోడ్డును తవ్వి పనులు చేపడుతూ కొనసాగిస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డును తవ్వి కంకర వేసి వదిలేశారు. రోడ్డు మీద వెళ్లాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. కొన్ని చోట్ల కల్వర్టు నిర్మాణాల కోసం తవ్వకాలు చేపట్టి వదిలేశారు. గ్రామంలో స్థానిక నాయకుల సమన్వయ లోపం రోడ్డు పనులకు పెద్ద శాపమైంది. ఉన్నత అధికారులు స్పందించి పనులను వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వేగిరం చేయాలని ఆదేశించాం

రోడ్డు వెడల్పు పనులను వేగవంతం చేయాలని ఆదేశించాం. రోడ్డు వెడల్పు పనుల్లో ఎలాంటి వివాదాలు లేవు. పనులను వేగవంతం చేసి త్వరలోనే పూర్తి చేస్తాం. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. – రవీందర్‌రెడ్డి, ఈఈ, ఆర్‌అండ్‌బీ, బాల్కొండ

సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీడబ్ల్యూవో రసూల్‌బీ అంగన్వాడీ టీచర్లకు సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం అంగన్వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రసూల్‌బీ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణీలు, కిశోర బాలల హాజరు విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే జూన్ మాసంలో హాజరు శాతాన్ని పెంచాలన్నారు. అనంతరం పోషణ్ ట్రాకర్, ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. సీడీపీవో భార్గవి, ఏసీడీపీవో శ్రీదేవి, నళిని, తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమైన అధికారులు

ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

మోర్తాడ్: బ్యాంకు లింకేజీ రుణాలతో మహిళలు వ్యాపారాలు చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సెర్ప్ డీపీఎం నీలిమ సూచించారు. మహిళా సంఘాల సభ్యులకు లక్ష్యానికి అనుగుణంగా రుణాలను పంపిణీ చేయాలని తెలిపారు. గురువారం మోర్తాడ్‌లోని మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో 2023–24ఆర్థిక సంవత్సరానికి గాను రూ.35.52 కోట్ల రుణాలను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.


వీవోఏలతో సమీక్ష నిర్వహిస్తున్న డీపీఎంలు

మక్కలు కొనుగోలు చేయాలని రాస్తారోకో

వర్ని : మొక్కజొన్న పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జలాల్పూర్‌లో రైతులు రాస్తారోకో నిర్వహించారు. కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం, సహకార సంఘం వారు కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ రైతులు ఆందోళనలు చేశారు. రోజుల తరబడి రోడ్లపై మొక్కజొన్నను ఉంచిన సహకార సంఘం వారు కుంటి సాకులు చెబుతూ కొనుగోలు చేయడం లేదని, వాతావరణం సహకరించక వర్షం పడితే ఉన్న మొక్కజొన్న కూడా తడిసి నేలపాలవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకోలో జాకోరా సొసైటీ డైరెక్టర్ సాయిలు, సుధాకర్, నగేష్, హరి రెడ్డి పాల్గొన్నారు.

తడిసిన మక్క కొనడం లేదు: కృష్ణారెడ్డి

సహకార సంఘం పరిధిలో మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని, అయితే కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న తడిసి ఉండటం వల్ల కొనుగోలు చేయలేదని జాకోరా సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి చెప్పారు. హమాలీల కొరత వల్ల కొంత ఆలస్యమైనా ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని సమస్యలను కొందరు అర్థం చేసుకోకుండా రాస్తారోకోలు చేయడం సరికాదని అన్నారు.


రాస్తారోకో చేస్తున్న మొక్కజొన్న రైతులు

భిక్షాటన చేస్తూ నిరసన తెలిపిన వీవోఏలు

తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ వీవోఏలు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. గురువారం వినూత్నంగా నిరసన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వీవోఏలు భిక్షాటన చేసి నిరసనలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం నాయకులు మాట్లాడుతూ.. తమ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. కనీసం వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్


బోధన్‌రూరల్: భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న వీవోఏలు


రుద్రూర్‌లో..


కోటగిరిలో ..


వర్నిలో..


ఆర్మూర్ పట్టణంలో..


రెంజల్‌లో..


ముప్కాల్ మండల కేంద్రంలో..

ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులపై సమావేశం

మాక్లూర్: ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులపై గురువారం మండల తహసీల్ కార్యాలయంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులతో తహసీల్దార్ శంకర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వివాహాలు జరిగి వెళ్లిపోయినవారు, మరణించినవారు, గ్రామాలు విడిచి ఇతర చోట్లకు వెళ్లిపోయిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించామని, ఇవే కాకుండా మరి కొన్ని అనుకోకుండా ఓటరు జాబితా నుంచి పోయాయని తహసీల్దార్ శంకర్ సమావేశంలోని ఆయా నేతల దృష్టికి తెచ్చారు. వీటన్నింటిపై అధికారుల కన్నా స్థానికంగా ఉండేవారికే పూర్తి అవగాహన ఉంటుందన్నారు. స్థానిక నాయకులు పొరపాట్లు జరిగి చోట ఆ విషయాన్ని అధికారుల దృష్టికి తేవాలన్నారు. విచారణ జరిపి వెంటనే ఓటరు జాబితాలో మార్పులు చేస్తామని తహసీల్దార్ శంకర్ చెప్పారు.


సమావేశంలో పాల్గొన్న ఆయా పార్టీల నేతలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆర్మూర్‌టౌన్: ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ అన్నారు. ఆర్మూర్‌లోని హౌసింగ్‌బోర్డులో అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఐడీసీఎఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మాట్లాడుతూ..15 రోజుల పాటు ప్రతిరోజు ఇంటింటికి ఆరోగ్య సిబ్బంది తిరుగుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు, విటమిన్ ఏ ద్రావణం పంపిణీ చేయడం చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలో పలువురికి వైద్యపరీక్షలు చేసి మందులను అందజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్, కౌన్సిలర్ ఖాందేష్ సంగీత తదితరులు పాల్గొన్నారు.


ఉచితంగా మందులు అందజేస్తున్న వైద్యాధికారులు

భూసార పరీక్షలు, మట్టి సేకరణ విధానంపై అవగాహన



మోర్తాడ్: భూసార పరీక్షలు, మట్టి సేకరణ విధానంపై రైతులకు శెట్‌పల్లిలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల వల్ల కలిగే ఉపయోగాలు, మట్టి నమూనా పద్ధతి, పసుపు విత్తన శుద్ధిపై నమూనా ప్రదర్శనలను నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ బీవీ రాజ్‌కుమార్, డాక్టర్ సురేష్, విజయ్‌కుమార్, రైతులు గంజాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దత్తత గ్రామంలో సేవలు అందిస్తాం

రుద్రూర్: రాయకూర్ గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల ఇన్‌చార్జి, డీన్ సాయిప్రసాద్ వెల్లడించారు. రాయకూర్‌లో గురువారం కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దత్తతలో భాగంగా రెండేళ్ల పాటు చేసే కార్యక్రమాల గురించి వివరించారు. ఆహార సాంకేతిక నైపుణ్యత, ఉత్పత్తులు, ఆధారిత విలువలు, దీర్ఘకాలికంగా మన్నికంగా ఉండే పదార్థాల తయారీపై అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సర్పంచ్ గంగారాం మాట్లాడుతూ.. ఫుడ్ సైన్స్ కళాశాల రాయకూర్‌ను దత్తత తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల బృంద సభ్యులకు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి టీవీ ఎస్ పద్మావతి, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జయప్రకాష్, ఉప సర్పంచ్ సీహెచ్ గంగారాం, ఎంపీటీసీ అనిల్ పటేల్, ఇన్‌చార్జి సీడీపీవో శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాయకూర్ సర్పంచ్, తదితరులు

లక్ష్మాపూర్‌లో ఎస్‌బీఐ సేవలు



రుద్రూర్: చందూర్ మండలం లక్ష్మాపూర్‌లో ఎస్‌బీఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఖాతాదారుల సేవా కేంద్రాన్ని(మినీ బ్యాంకు) గురువారం స్థానిక సర్పంచ్ బొడ్డోళ్ల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారులు నగదు జమ, తీసుకోవడం లాంటి సేవలను గ్రామంలోనే పొందవచ్చునని అన్నారు. గ్రామీణ ప్రాంతానికి బ్యాంకు సేవలు దగ్గర చేసిన బ్యాంకు మేనేజర్‌కు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ శ్యాంరావ్, కారేగాం తండా ఉప సర్పంచ్ వెంకటేష్ ఐకేపీ ఏపీఎం పద్మ, సీసీ ప్రవీణ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్



ఆర్మూర్‌టౌన్: పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని రెండో వార్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కాలనీల్లోని మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించారు. ముళ్లపొదలను తొలగించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఖాందేష్ సంగీత మాట్లాడుతూ.. ప్రజలు మురికి కాలువల్లో చెత్త వేయకూడదని, చెత్త సేకరించే వాహనాలకు అందించాలన్నారు. ఇళ్లలో పనికిరాని వస్తువులను అందజేస్తే ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు తరలిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, సానిటరి ఎస్సై మహేష్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



బోధన్‌రూరల్(బోధన్): అమ్దాపూర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి సర్పంచ్ సిర్ప మంజూల, గ్రామస్తులు పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ నిధులు విడుదల చేయడాన్ని హర్షిస్తూ గురువారం గ్రామంలో సీఎం కేసీఆర్, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలియజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమైందన్నారు.

సమాచారం..

31న కోటగిరి మండల సర్వసభ్య సమావేశం

రుద్రూర్: కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మనోహర్ రెడ్డి తెలిపారు. ఎంపీపీ వల్లేపల్లి సునీతా శ్రీనివాస్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావల్సిందిగా ఆయన కోరారు.

రేపు ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ

వర్ని: మండల కేంద్రంలో మాజీ సీఎం ఎన్టీఆర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ చేయనున్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా అభిమానులు ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు సినీ హీరో నందమూరి కల్యాణ్ రామ్, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మాజీ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు హాజరుకానున్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 –	ఫాస్ట్ ఎక్స్ (తెలుగు) 10.30, 4.10, 7.10 2018 (తెలుగు) - 10.10 (రాత్రి)
స్క్రీన్-2 –	బిచ్చగాడు2 - 12.15, 3.30, 6.45, 10.00
స్క్రీన్-3 –	మేమ్ ఫేమస్ - 10.30, 4.30, 10.30 మళ్లీ పెళ్లి - 1.40, 7.40
స్క్రీన్-4 –	మెంటో (తెలుగు) - 12.30, 9.15 2018 (తెలుగు) - 3.05 ది కేరళ స్టోరీ (తెలుగు) - 6.15

ఆర్‌వోబీ-771పై బీటీ రోడ్డు



సుభాష్‌నగర్: ఆర్మూర్ మండలంలోని గోవింద్‌పేట్ ఆర్‌వోబీ-771పై ఎంపీ అర్వింద్ ధర్మపురి చొరవతో బీటీ రోడ్డు పనులు చేపట్టారు. మూడు నెలల క్రితమే ఆర్‌వోబీని ఎంపీ ప్రారంభించిన విషయం తెలిసిందే. కాంట్రాక్టర్ పనులు నాసిరకంగా చేపట్టడంతో మూడు నెలలకే కంకర తేలింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎంపీ అర్వింద్ సంబంధిత కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. వారం రోజుల్లోగా గోవింద్‌పేట్ ఆర్‌వోబీపై బీటీ రోడ్డు వేయాలని, లేకుంటే కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. అదేసమయంలో రైల్వే అధికారులపై ఒత్తిడి పెంచారు. వారం రోజులుగా ప్రతిరోజు రైల్వే అధికారులు, కాంట్రాక్టర్‌తో సంప్రదిస్తూనే బీటీ రోడ్డు పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలకు స్పందించి ఆర్‌వోబీపై బీటీ రోడ్డు వేయించినందుకు ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

రహదారి సమస్య పరిష్కరించాలని వినతి



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని నల్లచెరువు కింద ఉన్న పంట పొలాలకు వెళ్లేందుకు రహదారి కావాలని రైతులు గురువారం తహసీల్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వ్యవసాయానికి సంబంధించిన పనుల కోసం సరైన రహదారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నారు వేసింది మొదలు ధాన్యం బయటకు తీసుకురావడానికి తీవ్ర అవస్థలు పడుతున్నామని సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని మున్నూర్ కాపు కల్యాణ మండపంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం జరుగనుంది. ఈ మేరకు గురువారం నందిపేట మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. సమావేశానికి ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఎంపీపీ సంతోష్‌రెడ్డి, జెడ్పీటీసీ యమున తెలిపారు.

క్లుప్తంగా

పథకాలపై అవగాహన



బాల్కొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన సురక్ష పథకాలు పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీ, ఏపీవై లాంటి పథకాలపై గురువారం మెండోరా మండలం బుస్సాపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలు బ్యాంకుల ద్వారా లభించే పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంతో పాటు ఆర్మూర్ మండలం పిప్రి గ్రామాల్లో గురువారం ఖరీఫ్ సీజన్‌కు గాను రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్లు కళ్లెం భోజా రెడ్డి, సోమ హేమంత్ రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు జీలుగ విత్తనాలను రాయితీపై రూ.850కి అందజేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు కళ్లెం మోహన్ రెడ్డి, ఆసపురం దేవి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ మోతె భోజకళా చిన్నా రెడ్డి పాల్గొన్నారు.

సఫాయి కార్మికులకు దుస్తులు..



వర్ని: అంతాపూర్‌లో సఫాయి కార్మికులకు దుస్తులను గురువారం సర్పంచ్ పద్మ పంపిణీ చేశారు. గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులకు తమ వంతు సహాయంగా దుస్తులను అందజేసినట్లు ఆమె చెప్పారు.

ఆర్థిక సహాయం

భీమ్‌గల్: పట్టణ కేంద్రానికి చెందిన చెప్యాల రామకృష్ణ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇంటికి వచ్చాక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఎల్‌వోసీ అందజేత



బోధన్: స్థానిక మున్సిపల్ 27వ వార్డు పరిధిలోని గౌస్‌నగర్‌కు చెందిన షేక్ సల్మా బేగం అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని కుటుంబీకులు ఎంఎల్‌ఏ షకీల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి చికిత్సకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. గురువారం పట్టం కేంద్రంలోని ఎంఎల్‌ఏ క్యాంప్ ఆఫీస్‌లో ఆమె కుటుంబీకులకు ఎంఎల్‌ఏ పీఏ అఖిల్ ఎల్‌వోసీని అందించారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందనలు



బోధన్: బోధన్‌కు చెందిన కంఠం మహేష్ కుమార్ సివిల్స్ తుది పరీక్ష ఫలితాల్లో ఆలిండియా 200 ర్యాంక్ సాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మహేష్ కుమార్‌కు సన్మానాలు, అభినందనలు వెల్లువెత్తాయి. గురువారం పట్టణ కేంద్రంలోని ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ డివిజన్ కమిటీ నాయకులు మహేష్ కుమార్ సౌమ్య దంపతులకు సన్మానించి అభినందించారు. ఆర్టీసీ డిపోలో డీఎం టీఎస్ స్వామి, ఉద్యోగులు సన్మానించారు. మహేష్ కుమార్ తల్లిదండ్రులు యాదమ్మ రాములును కూడా సన్మానించారు.

జాతీయ స్థాయి పోటీలకు మగ్గిడి విద్యార్థిని



పెర్కిట్: ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అమూల్య జాతీయ స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మధు గురువారం తెలిపారు. ఇటీవల వరంగల్ జిల్లాలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో అమూల్య ప్రతిభ చూపి జాతీయ స్థాయి ఎంపికైనట్లు పీఈటీ తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హుగ్లీలో ఈ నెల 28నుంచి జూన్ ఒకటి వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబు : 7997958181
ఆర్మూర్ ఎ. శివ : 9848956776
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899